సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 3 । మే । 2025



కందిపప్పు కట్

రేషన్‌లో కందిపప్పు పోయింది. కూటమి సర్కారు కందిపప్పు ఇవ్వడం మానేసింది.

- 10లో



కష్టార్జితం కాలిపోయింది

కొత్తూరులోని ఓ ఇంటిలో అగ్ని ప్రమాదం జరిగింది. దాచుకున్న డబ్బులన్నీ కాలిపోయాయి.

- 10లో

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటర్ సప్లిమెంటరీ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. దీనిపై ఆయన శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. మే 12 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 56 పరీక్ష కేంద్రాల్లో వొకేషనల్, జనరల్ గ్రూపుల నుంచి 21,571 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఆర్ఐఓ దుర్గారావు ఇంటర్మీడియట్ పరీక్షలపై వివరించారు.

న్యూస్‌రీల్

16 మంది వైద్య సిబ్బందికి నోటీసులు

నరసన్నపేట: విధులకు ఆలస్యంగా వస్తుండటంపై నరసన్నపేట ఏరియా ఆస్పత్రి సిబ్బందిలో 16 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు తెలిపారు. గడిచిన మూడు నెలల్లో పదిరోజులకు మించి ఆలస్యంగా ఎఫ్ఆర్ఎస్ నమోదైనట్లు ఉన్నతాధికారులు గుర్తించారని, వారి ఆదేశాల మేరకు నలుగురు వైద్యులతో పాటు మరో 12 మంది సిబ్బందికి నోటీసులు ఇచ్చామన్నారు. శుక్రవారం వారి నుంచి వివరణ తీసుకున్నామని అన్నారు. ఇదే పరిస్థితి పునరావృతమైతే అధికారుల ఆదేశాల మేరకు ఆలస్యమైన రోజులను సెలవు దినాలుగా మార్చుతామని శ్రీనుబాబు తెలిపారు.

సాగునీటి సమస్యలు పరిష్కరించాలి



సాగునీటి ప్రాజెక్టులు, కాలువల సందర్శన జీపు యాత్ర ప్రారంభిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: సాగునీటి సమస్యలు కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని, లేదంటే ఉద్యమాలు తప్పవని ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు ముర్రావు సూర్యనారాయణ అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో సాగునీటి కాలువలు, ప్రాజెక్టుల సందర్శనకు పూడివలస కూడలిలో జీపు యాత్రను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలంలో నారాయణపురం కుడి కాలువ కింద గత ఖరీఫ్‌లో పంటలు రైతులు కోల్పోయారని, ఈ ఏడాదైనా మరమ్మతులు నిర్వహించి సాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎచ్చెర్ల నియోజక వర్గంలోని తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టు కింద సైతం సాగునీటి కష్టాలు ఉన్నాయని తెలిపారు. వంశధార, నాగావళి నదుల ఆధారంగా ఉన్న ప్రాజెక్టుల మరమ్మతులు నిర్వహించాలని చెప్పారు. తక్కువ కేటాయింపులు రైతులకు శాపంగా మారుతున్నాయని అన్నారు. సాగునీటి సమస్యలపై కలెక్టర్ కార్యాలయం ముందు 7వ తేదీ ధర్నా చేస్తామన్నారు. రైతు సంఘం ప్రతినిధులు పొందూరు చంద్రరావు, కె.మోహనరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ కొత్తకోట అప్పారావు, వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు, భవిరి కృష్ణమూర్తి, స్థానిక సర్పంచ్ జరుగుళ్ల కృష్ణారావు, కొత్తకోట అచ్యుతరావు పాల్గొన్నారు.

కొండను చెరబట్టి గ్రావెల్ కొల్లగొట్టి



రణస్థలం మండలం సంచాం పరిధిలోని సంచాం కొండకు వెనుక భాగంలో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న దృశ్యమిది. పొక్లెయినర్లు పెట్టి తవ్వి తీసి తీస్తున్నారు. ఇక్కడ మూడు రోజులుగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే పేరు చెప్పి అక్రమ తవ్వకాలు జరిపారు.

- అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు
- బీజేపీ ఎమ్మెల్యే ఈశ్వరరావు ఇంటికి, స్కూల్‌కి మధ్యలో డంపింగ్
- రాత్రి, పగలు తేడా లేకుండా సంచాం, అర్జునవలసలో కొండ తవ్వకాలు
- కనీసం కన్నెత్తి చూడని అధికారులు



రణస్థలం మండలం అర్జునవలస రెవెన్యూ పరిధిలోని సంచాం కొండకు ముందు భాగంలో అక్రమంగా తవ్విన దృశ్యమిది. పొక్లెయినర్లు పెట్టి తవ్వి తరలించారు. ఇక్కడ రెండు రోజులుగా తవ్వకాలు జరిపారు. ఇక్కడా ఎమ్మెల్యే పేరు చెప్పి అక్రమ తవ్వకాలు చేశారు.



అధికార బరితెగింపునకు నిలువెత్తు సాక్ష్యమిది. సంచాం, అర్జునవలస పరిధిలోని సంచాం కొండ వెనక, ముందు భాగంలో అక్రమంగా తవ్విన గ్రావెల్‌ను టిప్పర్లతో బీజేపీ ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు ఇంటి, స్కూల్ మధ్య ఆవరణలో అన్‌లోడ్ చేసిన దృశ్యమిది. వందలాది టిప్పర్లతో అన్‌లోడ్ చేసిన గ్రావెల్‌ను అక్కడే చదును చేశారు.



ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు స్కూల్, ఇంటి ఆవరణలో గ్రావెల్ డంప్ చేసిన టిప్పర్లు వెనక నుండి ఢీకొట్టడంతో కూలిన సంచాం బస్ షెల్టర్ ఇది. గ్రావెల్ తరలింపునకు అడ్డంగా ఉందనో మరేంటో తెలియదు గానీ ఎన్నో ఏళ్ల నాటి బస్ షెల్టర్‌ను కూల్చేశారు.

సాక్షి ప్రతినిధి శ్రీకాకుళం:

అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న అక్రమాల పర్వానికి మరో సాక్ష్యమిది. రణస్థలం మండలంలో వందలాది ఎకరాల్లో ఉన్న సంచాం కొండను అక్రమంగా తొలిచేస్తున్నారు. జేసీబీ, తదితర యంత్రాలు పెట్టి రాత్రి, పగలు తేడా లేకుండా తవ్వకాలు జరిపారు. తవ్విన గ్రావెల్‌ను సాక్షాత్తు ఎమ్మెల్యే ఈశ్వరరావు స్కూల్‌కి, ఇంటి ఆవరణకి మధ్య డంప్ చేశారు. వందలాది టిప్పర్లతో రవాణా చేసి, అక్రమంగా అన్‌లోడ్ చేసి, ఆ గ్రావెల్‌తో ఆ ప్రదేశమంతా చదును చేశారు.

పట్టించుకోని అధికారులు

సంచాం రెవెన్యూ పరిధిలోని 84, 89-6 సర్వే నంబర్లలో గత మూడు రోజులుగా తవ్వకాలు జరపగా, గురువారం రాత్రి, శుక్రవారం అర్జునవలస సర్వే నంబర్ 139లో తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలించారు. చూసిన ప్రజలందరికీ హైవే పనులు జరిగే చోటుకి వెళుతున్నాయని తొలుత అనుకున్నారు. కానీ తర్వాత తెలిసింది.. అక్రమంగా తవ్వి తీసిన గ్రావెల్‌ను ఎమ్మెల్యే స్కూల్, ఇంటి మధ్య ఆవరణంలో డంప్ చేస్తున్నారని. స్థానికులు గొంతెత్తినా మూడు రోజులుగా అడ్డగోలుగా జరుగుతున్న తవ్వకాలు, తరలింపుపై ఏ ఒక్క అధికారి చర్యలు తీసుకోలేదు.



అడ్డుకోకపోగా వత్తాసు..

ఎమ్మెల్యే స్కూల్‌కి, ఇంటికి మధ్యలో ఉన్న సుమారు పది ఎకరాల స్థలంలో గ్రావెల్ వేసి చదును చేస్తున్నట్టుగా స్థానికులు నిర్ధారించుకున్నారు. దీంతో అక్కడికి వెళ్లి టిప్పర్లతో తరలిస్తున్న వారిని నిలదీయగా ఈ టిప్పర్లన్ని విశ్వ సముద్ర తదితర సంస్థలకు చెందినవని, ఎమ్మెల్యేకు సంబంధించిన స్కూల్, ఇంటి ఆవరణలో డంప్ చేయమంటే చేశామని సంబంధిత వ్యక్తులు బదులిచ్చారు. దీంతో స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అక్రమాలను అడ్డుకోవాల్సింది పోయి టిప్పర్ల సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారని స్థానికులను కొంతమందిని పోలీసు అధికారులు పిలిచి వార్నింగ్ ఇచ్చినట్టు తెలిసింది. గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే శాంతియుతంగా నిరసన తెలపాలే తప్ప టిప్పర్ల సిబ్బందితో దురుసుగా ప్రవర్తించరాదని ఒకింత మందలించి పంపించేసినట్టు సమాచారం.

ఎలాంటి అనుమతులు లేవు

హైవే వాళ్లు కలెక్టర్‌కు పర్మిషన్ పెట్టారు. కానీ ఇంకా అనుమతులు రాలేదు. ఎవరు తీసుకువెళ్లారో తెలియదు. దర్యాప్తు చేస్తాను. వీఆర్‌ఓలు ప్రస్తుతం అందుబాటులో లేరు. శనివారం పంపించి విచారణ చేయిస్తాను.

– ఎస్. ప్రసాద్, తహసీల్దార్, రణస్థలం

వేలిముద్రలు వేసి రేషన్ సరుకులకు దూరమైన టెక్కలి మండలం సవర సార్లిగాం గిరిజనులు



వేలిముద్రలు వేయించుకున్నారు.. రేషన్ ఎగ్గొట్టారు



- గిరిజనులకు అందని ఏప్రిల్ నెల రేషన్ సరుకులు
- స్పందించని అధికారులు

టెక్కలి: రేషన్ ఇచ్చేస్తామన్నారు.. అందరి దగ్గరా వేలి ముద్రలు తీసుకున్నారు.. అదిగో ఇదిగో అంటూ నెల గడిపేశారు. ఆఖరికి ఏప్రిల్‌నెల రేషన్ ఇవ్వకుండా ఎగ్గొట్టేశారు. టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ సవరసార్లిగాం గిరిజన గ్రామంలో సుమారు 200 మంది గిరిజనులకు గత నెల రేషన్ సరుకులు పంపిణీ చేయలేదు. వేలి ముద్రలు సైతం తీసుకుని చివరకు రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో ఆయా కుటుంబాలు అనేక అవస్థలు పడుతున్నాయి. పంచాయతీ పరిధిలో డిపో నంబర్ 791 పరిధిలో సార్లిగాం, సవరసార్లిగాం, సన్యాసిపేట, హరిపురం, సతివాడ, బలరాంపురం తదితర గ్రామాలు ఉన్నాయి. వాటిలో ఒక్క సవర సార్లిగాం గ్రామంలో 62 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో సుమారు 200 మంది జనాభా ఉన్నారు. వారందరికీ ఏప్రిల్‌లో రేషన్ ఇవ్వలేదు. రెండు రోజుల కిందట ఎండీయూ సిబ్బంది రేషన్ పంపిణీ కోసం వెళ్తే ఏప్రిల్ నెల రేషన్ ఇస్తే తప్ప మే నెల రేషన్ తీసుకోబోమని వారు చెప్పడంతో, తమకేమీ సంబంధం లేనట్లుగా ఆ సిబ్బంది వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఏప్రిల్, మే నెలల రేషన్ అందించాలని గిరిజనులు కోరుతున్నారు.

సంపాదనలో సగం బియ్యానికే..



మా కుటుంబానికి బియ్యం ఇవ్వకపోవడంతో నా భర్త చేసిన కూలి డబ్బులతో సగం బియ్యం కొనాల్సి వస్తోంది. మా లాంటి వారికి రేషన్ బియ్యం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు.

– బెజ్జి అరుణ, బాధితురాలు

ఊరివారే సాయం చేశారు



నేను ఒక్క దాన్నే ఇంట్లో ఉంటాను. ఎలాంటి ఆధారం లేదు. రేషన్ బియ్యంతో నెల మొత్తం గడుస్తుంది. ఇప్పుడు బియ్యం ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నాను. ఊర్లో వాళ్లంతా పిడికెడు బియ్యం సాయం చేస్తున్నారు.

– మంగపేట ఆదమ్మ, బాధితురాలు

పక్కింటి నుంచి తెచ్చుకుంటున్నాం..



మాకు గత నెల రేషన్ బియ్యం ఇవ్వలేదు. రేషన్ బియ్యం కోసం వేలిముద్రలు తీసుకున్నారు. అయినా సరుకులు ఇవ్వలేదు. పక్కింటి నుంచి బియ్యం అప్పు తెచ్చుకుని రోజులు గడుపుతున్నాం.

– మంగపేట నారాయణరావు

చీడిపూడిలో రేషన్ సరుకుల పంపిణీలో కోత

సారవకోట: మండలంలోని చీడిపూడి గ్రామంలో రేషన్ సరుకుల పంపిణీలో కోత విధిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ గ్రామ రేషన్ డీలర్‌ను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగించారు. అప్పటి నుంచి రేషన్ సరుకులు వీఆర్వో అథంటికేషన్‌తో ఇస్తున్నారు. అయితే ఏప్రిల్‌లో లబ్ధిదారులకు రేషన్ సరుకులు ఇవ్వకుండానే లబ్ధిదారులతో బయోమెట్రిక్ వేయించుకున్నారు. మే నెల రేషన్ సరుకులు గురు వారం నుంచి సరఫరా చేస్తున్నారు. అయితే 5 కిలోలు, 10 కిలోలు ఉన్న లబ్ధిదారులకు మాత్రమే పూర్తిస్థాయి సరుకులు ఇస్తున్నారని మిగిలిన వారికి 3 కిలోలు చొప్పున కోత విధిన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై వీఆర్‌ఓ రాపాక లక్ష్మీనారాయణను వివరణ కోరగా అలాట్‌మెంట్ తక్కువగా వచ్చిందని, అందుకే కోత విధిస్తున్నామని తెలిపారు.

మళ్లీ బీచ్ ఫెస్టివల్



- బారువ తీరంలో నేటి నుంచి ప్రారంభం
- సమస్యలు పరిష్కరించాలని స్థానికుల విన్నపం

సోంపేట: బారువ తీరం మరోసారి బీచ్ ఫెస్టివల్‌కు సిద్ధమైంది. గత నెల 18, 19 తేదీల్లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే పర్యాటకులకు వసతుల కల్పనలో నిర్వాహకులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నెలలో మరో రెండు రోజులు బీచ్ ఫెస్టివల్ నిర్వహించడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే బారువ తీర ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. పర్యాటకులు సేద తీరేందుకు టెంట్లు వేయాలని, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. తాగునీటి సరఫరా కూడా ఏర్పాటు చేయలేదని గుర్తు చేశారు.

ట్రాఫిక్, విద్యుత్ కష్టాలు

ఏప్రిల్‌లో బీచ్ ఫెస్టివల్‌కు వచ్చిన పర్యాటకులను ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధించింది. బారువ ప్రధాన రహదారి వద్దకు చేరుకోవడానికి గంటల సమయం పట్టింది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాల్సి ఉంది. సాయంత్రం అయితే బారువ తీర ప్రాంతం నుంచి బారువ కొత్తూరు గ్రామం వరకు విద్యుత్ వీధి దీపాలు లేకపోవడంతో పర్యాటకులు చీకటిలో ఇబ్బందులు పడ్డారు.

ఏర్పాట్ల పరిశీలన..

బీచ్ ఫెస్టివల్‌పై స్థానిక అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు. శుక్రవారం సాయంత్రం బారువ తీరంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు, బోట్ రైడింగ్, బైక్ రైడింగ్, కిడ్స్ ప్లేజోన్, వాటర్ సర్ఫింగ్, ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు.

డీబార్ విద్యార్థులకు పరీక్షకు అనుమతి

ఎచ్చెర్ల క్యాంపస్: పదో తరగతి పరీక్షల సమయంలో స్క్వాడ్ తనిఖీల్లో కుప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. వీరిని డీబార్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి ఈ నెల చివర్లో నిర్వహించే 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో పరీక్ష రాసే అవకాశం కల్పించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

అర్ధరాత్రి విధ్వంసం



ఊళ్లన్నీ ఆదమరిచి నిద్దరోతున్న వేళ..

గురువారం రాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఓ వైపు ఉరుములు, మెరుపులతో ఆకాశం భయపెడుతుంటే.. బలంగా వీచిన గాలులు విద్యుత్ స్తంభాలు, చెట్లు, ఇళ్లపైకప్పులను నేల కూల్చాయి. అరటి, మామిడి వంటి పంటలను నాశనం చేశాయి.

అరటి తోటలు ధ్వంసం

నరసన్నపేట: ఈదురుగాలులతో కూడిన వర్షానికి అరటి తోటలు ధ్వంసమైపోయాయి. కోమర్తి, మాకివలసల్లో రైతులు బాగా నష్టపోయారు. కోమర్తిలో లబ్బ రాము, లబ్బ శ్రీను, పంచిరెడ్డి సింహాచలం లతో పాటు పలువురు రైతుల అరటి తోటలు పడిపోయాయి.

గాలి తీవ్రతతో విద్యుత్‌కు అంతరాయం



నగరంలో విద్యుత్ లైన్లను సరిచేస్తున్న సిబ్బంది

- శ్రీకాకుళం డివిజన్‌లోనే రూ.10 లక్షల వరకు విద్యుత్ నష్టం

అరసవల్లి: గురువారం అర్ధరాత్రి తీవ్రమైన గాలులు జిల్లాపై విరుచుకుపడ్డాయి. ఈ ప్రభావం జిల్లా కేంద్రంతో పాటు డివిజన్‌లో పలు మండలాల్లో విద్యుత్ సరఫరాపై పడింది. దీంతో అర్ధరాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు కూడా పలు చోట్ల విద్యుత్ అంతరాయం వాటిల్లింది. శ్రీకాకుళం, గార, బూర్జ, నరసన్నపేట, ఆమదాలవలస తదితర మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అర్ధరాత్రి గాలుల తీవ్రత కొనసాగడంతో విద్యుత్ శాఖ సిబ్బంది పునరుద్ధరించే వీలు లేకపోయింది. దీంతో శుక్రవారం ఉదయం నుంచి విద్యుత్ శాఖ ఆపరేషన్స్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఈఈ పైడి యోగేశ్వరరావులు రంగంలోకి దిగి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. కాంట్రాక్టర్ ఉంగటి పాపారావు ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లుగా పంపించి ఎక్కడికక్కడ విద్యుత్ పునరుద్ధరణ పనులను మొదలు పెట్టించారు. దీంతో మధ్యాహ్నం సమయానికి విద్యుత్ సరఫరాను పలు ప్రాంతాలకు అందించారు. అయినప్పటికీ శ్రీకాకుళం రూరల్, గార తదితర మండలాల్లో శుక్రవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పూర్తిస్థాయిలో జరగలేదు. దీంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ పరంగా నష్టాన్ని అంచనాగా రూ.10 లక్షల వరకు ఉంటుందని అధికారికంగా ప్రకటించారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి అవసరమైన చోట కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించారు. ఇదిలావుంటే నగరంలో పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకూలడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఈ పరిస్థితుల్లో ఈఈ యోగేశ్వరరావు స్వయంగా పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు.



పొన్నాడలో రవి ఇంటిపై పడిన విద్యుత్ స్తంభం

వర్షం, గాలుల బీభత్సం

ఎచ్చెర్ల క్యాంపస్: వర్షం, గాలులు గురువారం రాత్రి బీభత్సం సృష్టించాయి. పొన్నాడలో రాము, రవి అనే ఇద్దరు వ్యక్తుల ఇళ్లపై విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. గ్రామస్తులు ఫిర్యాదు చేయగా విద్యుత్ సరఫరా నిలిపివేసి, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. కేశవ రావుపేట శివారులో చీడిఖాన్ చెరువు గట్టుపై ఉన్న అమ్మవారి వేప చెట్టు కూలిపోయింది. మండలంలో జీడి మామిడి, మామిడి పంటకు తీరని నష్టం వాటిల్లింది. విద్యుత్ అంతరాయాలు కలగగా శుక్రవారం సాయంత్రం నాటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

23 ఐటీఐలు.. 3806 సీట్లు




- ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- 24 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్ : పదో తరగతి పూర్తి చేసిన పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువగా ప్రాధాన్యమిచ్చే కోర్సుల్లో ఐటీఐ(ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఒకటి. ఇందులో చేరిన విద్యార్థులకు అప్రెంటీస్ తర్వాత 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగాలు లభించే అవకాశాలు అధికంగా ఉంటాయి. నైపుణ్యాలు ఆధారంగా విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుంది. మరోవైపు పాలిటెక్నిక్ డిప్లమాలో నేరుగా రెండో ఏడాది లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు లభిస్తాయి. అందుకే ఐటీఐలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోంది. జిల్లాలో మూడు ప్రభుత్వ ఐటీఐలు(శ్రీకాకుళం డీఎల్‌టీసీ, ఎచ్చెర్ల, పలాస)లలో 760 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 20 ప్రైవేట్ ఐటీఐలలో 3056 సీట్లు కలిపి మొత్తం 23 ఐటీఐలలో 3806 సీట్లలో ప్రవేశాలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది.

కోర్సులివే..


ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐల్లో రెండేళ్లు, సంవత్సరం వ్యవధి గల ట్రేడులు ఉన్నాయి. విద్యార్థుల ఆసక్తి మేరకు ట్రేడ్లు ఎంచుకోవచ్చు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్ సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, మోటార్ మెకానిక్ రెండేళ్ల ట్రేడులు కాగా, వెల్డర్, కోపా, డీజిల్ మెకానిక్, హార్టికల్చర్ ఏడాది చదవాల్సి ఉంటుంది. మహిళల కోసం ప్రత్యేకంగా సూయింగ్ టెక్నాలజీ ట్రేడ్లు సైతం అందుబాటులో ఉన్నాయి.



ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ..

ఐటీఐ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 'ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో ఈ నెల 24లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం ప్రభుత్వ ఐటీఐల్లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుంది. జూన్‌లో ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తారు. కౌన్సెలింగ్ సమాచారాన్ని విద్యార్థుల ఫోన్లకు ఎస్ఎంఎస్ ద్వారా పంపిస్తారు. 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్, ప్రత్యేక కేటగిరీల రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. అర్హులకు నిబంధనల మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి



10వ తరగతి తర్వాత ఉపాధికి అవకాశం ఉన్న కోర్సు ఐటీఐ. ఈ కోర్సుల్లో ఎటువంటి ఒత్తిడి ఉండదు. ప్రయోగాలకు, నైపుణ్యాలకు ప్రాధాన్యముంటుంది. అప్రెంటీస్, నైపుణ్యం ఆధారంగా పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ ఐటీఐలకు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలి.

– ఎల్.సుధాకరరావు, ప్రవేశాల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్

క్లుప్తంగా

గత ప్రభుత్వంలోనే అనుమతులు


ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: మండలంలోని తీరప్రాంత మత్స్యకారుల ప్రయాణ సమస్యలు పరిష్కరించడానికి, సోంపేట మండల కేంద్రానికి వేగంగా చేరుకోవడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే చర్యలు తీసుకున్నట్లు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొండిరేవు వంతెన, మహేంద్ర తనయ నదిపై బ్రిడ్జిల నిర్మాణానికి జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, జిల్లా పార్టీ పెద్దలు చొరవతో గత ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కేంద్రప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకు వచ్చినట్లు తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద జీఓ నంబరు-788తో 2023 నంబర్ 23న అనుమతులు వచ్చాయని గుర్తు చేశారు. కొండి రేవు బ్రిడ్జికి రూ.3.45 కోట్లు, మహేంద్రతనయ నది బ్రిడ్జికి రూ.14.60 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచే సమయానికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, అదే జీవోతో ప్రస్తుతం టెండర్లు ఖరారైనట్లు పేర్కొన్నారు. సమస్య పరిష్కరించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎంపీపీ స్పష్టం చేశారు.

మా పార్టీకి అనుకూలంగా ఉంటేనే పింఛన్

- ఒంటరి మహిళ పింఛన్ నిలిపివేసిన టీడీపీ నేతలు


బాధితురాలు శకుంతల

నరసన్నపేట: 'మా పార్టీకి అనుకూలంగా ఉండటం లేదు. మాకు వ్యతిరేకంగా ఉంటున్నావు.. మా ప్రభుత్వంలో నీకు ఎందుకు పింఛన్ ఇస్తాం.. నువ్వు మా పార్టీకి అనుకూలంగా ఉంటేనే పింఛను ఇప్పిస్తాం' అంటూ టీడీపీ నేతలు తన పింఛన్ ఆపేశారని నరసన్నపేట మండలం రావులవలసకు చెందిన వెలమల శకుంతల అనే ఒంటరి మహిళ వాపోయింది. రెండు నెలలుగా పింఛన్ ఇవ్వలేదని, మే నెలలో ఇస్తామని అధికారులు హామీనిచ్చారని, ఇప్పుడు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లగా స్థానిక ఎమ్మెల్యే ఆపమని చెప్పినందునే ఇవ్వలేదని అంటున్నారని కన్నీటిపర్యంతమైంది. ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదలైనా టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పంపిణీ చేయకుండా నిలిపేశారని వాపోయింది. ఈ విషయమై ఎంపీడీఓ మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా పింఛన్‌పై పిర్యాదు వచ్చినందున నోటీసు ఇచ్చి విచారణ చేయించామని, ఒక ఇంట్లోనే కుటుంబంతో నివాసముండటంతో పింఛన్ నిలుపుదల చేశామని చెప్పారు.

వివాహిత అనుమానాస్పద మృతి

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతిచెందింది. గురువారం రాత్రి వరకు మెయిన్‌రోడ్డులో తమ కుటుంబానికి చెందిన కూరగాయల షాపులో చలాకీగా ఉన్న ఆమె శుక్రవారం ఉదయానికి ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించడంతో స్థానికులు నిర్ఘాంతపోయారు. ఈమె భర్త ఉపాధి కోసం వలస వెళ్లడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉంటోంది. ఆర్థిక వ్యవహారాలే మృతికి కారణమని తెలుస్తోంది. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో గురువారం అర్ధరాత్రి వరకు ఇంట్లో ఘర్షణ చోటుచేసుకొందని, తర్వాత ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మృతురాలు కన్నవారు కూడా కంచిలిలోనే ఉంటున్నారు. కాగా, పోలీసులకు సమాచారం ఇవ్వకుండా, భర్త రాకుండానే ఆదరాబాదరాగా అంత్యక్రియలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

కంచిలిలో మాయం.. కోయంబత్తూరులో ప్రత్యక్షం

కాశీబుగ్గ: కంచిలి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళ బొడ్డేపల్లి ధనలక్ష్మి ఐదు రోజుల కిందట అనుకోకుండా తమిళనాడు వెళ్లే రైలు ఎక్కింది. కోయంబత్తూరులో దిగడంతో అక్కడి స్థానికులు, పోలీసులు చేరదీశారు. ఇంతలో ఆన్‌లైన్ పోలీసింగ్ వారికి ఆమె ఆచూకీ మ్యాచ్ అవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు కోయంబత్తూరు వెళ్లి శుక్రవారం స్వగ్రామం కంచిలికి తీసుకువచ్చారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రణస్థలం: జాతీయ రహదారిపై కారును లారీ ఢీకొట్టిన ఘటనలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 10.40 గంటల సమయంలో జె.ఆర్.పురం బస్‌స్టేషన్ సమీపంలో విశాఖపట్నం వైపు నుంచి వస్తున్న లారీ ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. లారీ డ్రైవర్ గమనించక 50 మీటర్ల వరకు కారును ఈడ్చుకెళ్లాడు. అదృష్టవశాత్తు కారులో ఉన్న నలుగురికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కారులో ఉన్న నలుగురు విశాఖపట్నం నుంచి జలుమూరు వెళుతున్నారు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై ఉమామహేశ్వరరావు పరిశీలించి ట్రాఫిక్ చక్కదిద్దారు.

కందిపప్పు కట్!

- రేషన్ లబ్ధిదారులకు నాలుగు నెలలుగా నిలిచిన సరఫరా
- కూటమి ప్రభుత్వం తీరుపై పేదల ఆగ్రహం
- ఈ నెలా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ


ఎండీయూ వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

హిరమండలం : పేదల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఒక్కో సంక్షేమ పథకాన్నీ వ్యూహాత్మకంగా ఎత్తేస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేసే కందిపప్పునకూ మంగళం పాడింది. నాలుగు నెలలుగా రేషన్ షాపుల్లో కందిపప్పు ఇవ్వకుండా కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడంతో లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మే కోటాలోనూ కందిపప్పు రాకపోవడంతో ఉసూరుమంటున్నారు. మరోవైపు ఈకేవైసీ కాలేదన్న నెపంతో రేషన్ లబ్ధిదారులకు పెద్ద ఎత్తున కోత పెడుతోంది.

అరకొరగా పంపిణీ..

కూటమి సర్కారు కేవలం బియ్యం, పంచదార సరఫరాకే ప్రజాపంపిణీ వ్యవస్థను పరిమితం చేసింది. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కందిపప్పు ఇవ్వకపోవడంతో కార్డుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రేషన్ డిపోల ద్వారా అన్ని రకాల పప్పులు, సరుకులు రాయితీ ధరలకు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో రేషన్ సరుకులు ఇవ్వలేకపోతున్నారు. కందిపప్పు ధర బహిరంగ మార్కెట్లో కేజీ రూ.130-రూ.150 ఉంది. దీంతో రేషన్ దుకాణాల్లో కందిపప్పునకు డిమాండ్ ఏర్పడింది.

ఈకేవైసీ గండం..

జిల్లాలో 165 ప్రభుత్వ రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటి పరిధిలో 6,71,803 రేషన్‌కార్డులు ఉన్నాయి. 30 మండలాల్లో 19,39,082 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉండగా.. ఇప్పటికీ 18,04913 మంది పూర్తి చేశారు. 2359 మంది ప్రోగ్రెస్‌లో ఉన్నారు. ఇంకా 9,9914 మంది చేయించుకోలేదు. ఇందులో 0-5 ఏళ్లలోపు 29,933 పిల్లలు, 80 ఏళ్ల పైబడిన వాళ్లు 2013 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదు. ఈకేవైసీ చేయించుకోలేని వారి కి మే నెలలో రేషన్ అందే పరిస్థితి లేదు.


కందిపప్పు

నాలుగు నెలలుగా ఇవ్వలేదు



ప్రభుత్వం నుంచి రాలేదంటూ నాలుగు నెలలుగా కందిపప్పు ఇవ్వడంలేదు. గతంలో డిపోలో రూ.67కే కిలో కందిప్పు ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వకపోవడంతో మార్కెట్‌లో రూ.130పైగా వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

– జి.లలిత, తంప గ్రామం, హిరమండలం మండలం

ఇంకా రాలేదు..



ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేయలేదు. వచ్చిన వెంటనే కార్డుదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎన్.హనుమంతరావు, తహసీల్దార్, హిరమండలం

కష్టార్జితం కాలిపోయింది..

- అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం
- కుమార్తె వివాహం కోసం దాచిన రూ.2.80 లక్షల నగదు బూడిద


కాలిపోయిన కరెన్సీ నోట్లు


కాలిపోయిన ఇంటి వద్ద బాధితురాలు పద్మావతి

కొత్తూరు: కష్టార్జితం కాలిపోయింది. కుమార్తె పెళ్లి కోసం దాచిపెట్టిన నగదు, బంగారం బూడిదైంది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రం కొత్తూరులోని కొత్తపేట కాలనీలో శుక్రువారం కొగాన పద్మావతి శుక్రవారం ఉదయం దేవుడి పటం వద్ద దీపం వెలిగించి ఉపాధి పనికి వెళ్లిపోయింది. ఇంతలో ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు గమనించి అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే పద్మావతి కుమార్తె వివాహం కోసం ఇనుప పెట్టెలో దాచిన రూ. 2.80 లక్షల నోట్లు కాలి బూడిదయ్యాయి. తులంన్నర బంగారం, పిల్లల విలువైన పత్రాలు, దుస్తులు, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. సర్వం కోల్పోయిన పద్మావతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొత్తూరుకు చెందిన గోగుల చిట్టిబాబు బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

కిడ్నీ సమస్యతో ఇంటర్ విద్యార్థి మృతి


లింగాల కిషోర్(ఫైల్)

పొందూరు: మండలంలోని కేసవదాసుపురం గ్రామానికి చెందిన లింగాల కిషోర్(16) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ప్రస్తుతం ఎచ్చెర్లలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న కిషోర్ ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా రెండు కిడ్నీలు పూర్తిగా పాడైనట్లు గుర్తించారు. పేద కుటుంబం కావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించలేక కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కిషోర్ పదో తరగతి లోలుగు హైస్కూల్లో చదివాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు సుజాత, రాజు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఎన్‌బీడబ్ల్యూ అమలు చేయాలి


ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : నిందితులపై పెండింగ్ ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) త్వరితగతిన అమలు చేయాలనిఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో ప్రాపర్టీ కేసుల్లో పెండింగ్ ఎన్‌బీడబ్ల్యూ అమలు, చైన్‌స్నాచింగ్, వాహనాల చోరీ, ఆలయాల్లో దొంగతనాలు తదితర నేరాలపై జూమ్ కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై దాడులు, ఎస్సీ, ఎస్టీ, పోక్సో వంటి కేసుల్లో ఎన్‌బీడబ్ల్యూ ఉంటే గుర్తించి వారి చిరునామా, ఇతర ఆధారాలను బట్టి కోర్టులో హాజరుపర్చాలని ఆదేశించారు. పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు కోటేశ్వరరావు, నేతాజీ పాల్గొన్నారు.

మసీదులో గంధంచెట్లు నరికివేత

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని సూర్యమహాల్ కూడలి పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న జామియా మసీదులో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు గంధం చెట్లు నరికి తరలించే యత్నం చేశారు. ఈ విషయమై ఇప్పటికే వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు మసీదు మౌజన్ (గురువు) ఎస్.కె.మహ్మద్ ఫిర్యాదు చేసినట్లు మత పెద్దలు కె.ఎస్.అమానుల్లా, మరికొందరు చెప్పారు. మసీదులో సుమారు 40 వరకు చిన్నవి, పెద్దవి గంధం చెట్లున్నాయని, శుక్రవారం ఉదయం చెట్లను వాచ్‌మెన్ నాయుడు దగ్గరుండి ట్రిమ్మింగ్ చేసినట్లు తెలిసిందన్నారు. సాయంత్రం 4 గంటలకు 30 అడుగుల పొడవుండే ఒక గంధం చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు తరలించేశారని అదే వాచ్‌మెన్ మౌజన్‌కు చెప్పడంతో ఆయన ఫిర్యాదు చేశారు. ఇంకా లోపల ఎన్ని చెట్లు కొట్టేశారో తెలియాల్సి ఉందన్నారు.


గంధం చెట్టు కొమ్మ

ఉచిత శిక్షణతో ఉపాధి

- సత్యసాయి మందిరాల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ
- నరసన్నపేటలో ఇప్పటివరకు 770 మందికి తర్ఫీదు
- ఆసక్తి చూపుతున్న మహిళలు


చిత్తిరి వీధిలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న యువతులు


మారుతీనగర్ సాయిమందిరంలో మగ్గం వర్క్స్ నేర్చుకుంటున్న మహిళలు

నరసన్నపేట: సేవే పరమావధిగా సత్యసాయి సేవా సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా స్వల్పకాలిక ఉచిత నైపుణ్య శిక్షణలు అందిస్తున్నాయి. నిరుద్యోగ యువతీ యువకులకు, గృహిణులకు వారి ఆసక్తి బట్టి శిక్షణలు ఇస్తూ ఉపాధి అవకాశాలపై నమ్మకాన్ని కలిగిస్తున్నారు. ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్, కంప్యూటర్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణలు ఇస్తున్నారు. నరసన్నపేట మండలంతో పాటు పరిసర మండలాలకు చెందిన వారూ వచ్చి ఉచిత శిక్షణలకు వినియోగించుకుంటున్నారు. నరసన్నపేటలోని మారుతీనగర్ -1 లో సత్యసాయి మందిరం, చిత్తిరి వీధిలోని సాయి పెద్ద మందిరంలో ఏడాది కాలంగా ఈ స్వల్ప కాలిక శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారు. మారుతీనగర్‌లో 510 మంది, పెద్దమందిరంలో 260 మంది శిక్షణ పొందారు. కంప్యూటర్ శిక్షణకు మంచి ఆదరణ లభిస్తుంద పెద్ద మందిరం కన్వీనర్ నాగేశ్వరరావు చెబుతున్నారు. ఇప్పటికే రూ. 3.5 లక్షలు వెచ్చించి కంప్యూటర్లు, స్క్రీన్ సిద్ధం చేశామన్నారు.

కంప్యూటర్ శిక్షణ పొందాను



నేను డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. సాయంత్రం పూట సత్యసాయి మందిరంలో 45 రోజుల పాటు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ భవిష్యత్తులో తప్పక ఉపయోగపడుతుంది.

– పి.హర్షవర్థిని, చిత్తిరివీధి

మగ్గం వర్క్ నేర్చుకున్నాను..



నేను గృహిణిని. ఇంట్లో టైలరింగ్ చేస్తుంటాను. అయితే వస్త్రాలు కుట్టేప్పుడు కొందరు మగ్గం వర్క్ కావాలని అడుగుతున్నారు. దీంతో మారుతీ నగర్ మందిరంలో మగ్గం వర్క్‌పై ఉచితంగా శిక్షణ పొందుతున్నాను.

– పి.సంధ్యారాణి, ఆర్టీసీ కాంప్లెక్స్, నరసన్నపేట

అంతా ఉచితమే..



సత్యసాయి భక్తునిగా ఇటువంటి శిక్షణలు ఉచితంగా నిర్వహిస్తుండటం ఆనందంగా ఉంది. ఇప్పటివరకు టైలరింగ్, మగ్గం వర్క్‌పై శిక్షణలు ఇచ్చాం. మే 15 నుంచి ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ వర్క్‌పై శిక్షణ ఇవ్వనున్నాం.

– ఎం.ఎల్.నాయుడు, మారుతీనగర్-1 మందిరం కన్వీనర్



తీరం నుంచి సముద్రంలోకి..

ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ అందరి బాధ్యతని అటవీశాఖ సెక్షన్ అధికారి ఆర్.రాఘవయ్య అన్నారు. కవిటి మండలం కపాసుకుద్దిలో శుక్రవారం ప్రభుత్వం అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన సముద్ర తాబేలు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. 560 ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి వదిలారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రవికుమార్, రక్షణ దళ సభ్యులు వల్లభరావు ధర్మరాజు కుమార్ స్వామి, కోడా దేవరాజు తదితరులు పాల్గొన్నారు. – కవిటి

గారలో వైద్య శిబిరం

గార: మండల కేంద్రం గార గ్రామంలోని సెగిడివీధిలో పలువురికి విషజ్వరాలు సోకడంతో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 'గార గ్రామంలో విష జ్వరాలు' శీర్షికన సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో గార పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమ్య, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్తనమూనాలు సేకరించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి డాక్టర్ సూర్యం గ్రామంలో పర్యటించారు. ప్రస్తుతానికి జ్వరాలు అదుపులోనే ఉన్నాయని, మలేరియా లార్వా ఎక్కడా లేవన్నారు. మరో రెండు రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. కొద్ది నెలల క్రితమే ఈ వీధిలో కొత్త పైపు లైను వేసి సురక్షితమైన తాగునీరు అందిస్తున్నామని సర్పంచ్ మార్పు దుర్గాపృథ్వీరాజ్ తెలిపారు.


వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

పలాస : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ఆపి వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని సి.పి.ఐ. ఎం.ఎల్ న్యూడెమొక్రసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు వివిధ ప్రజా సంఘాలతో కలిసి శుక్రవారం పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు దండకారణ్యంలో ఆదివాసీలు సుమారు 400 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు పార్టీ నాయకులను, కార్యకర్తలను భౌతికంగా నిర్మూలించే కార్యక్రమం చేపట్టడం అప్రజాస్వామ్యమన్నారు. కర్రెగుట్ట కొండలను జల్లెడ పడుతున్నారని, అన్నిరకాల భద్రతా బలగాలను ఈ ఆపరేషన్‌కు వినియోగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, చాపర వేణు, కొర్రాయి నీలకంఠం, పోతనపల్లి అరుణ, లక్ష్మణరావు, పుచ్చ దుర్యోధనరావు, మద్దిల రామారావు, ఎం.వినోద్, గొరకల బాలకృష్ణ, వంకల పాపయ్య, మామిడి భీమారావు, రాపాక మాధవరావు, జడ్డే అప్పయ్య, పోతనపల్లి కుసుమ, బర్ల గోపి, ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల ధర్నా

శ్రీకాకుళం పాతబస్టాండ్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పని చేస్తున్న కెప్టెన్(డ్రైవర్లు)లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇప్పించాలని ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, ఎం.దశరథరావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో సమయంతో నిమిత్తం లేకుండా సేవలందిస్తున్నామని, తమ సేవలను ప్రభుత్వాలు గుర్తించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. పదేళ్లుగా అతి తక్కువ వేతనంతో జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. వీరికి సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు సంఘీభావం తెలిపారు. నిరసన కార్యక్రమంలో కె.రాజేశ్వరరావు, కె.కృష్ణంనాయుడు, ఎల్.రాంబాబు, పి.వెంకటరావు, ఎం.మణికంఠ, పి.అనంత్, ఎస్.రాజశేఖర్, బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న డ్రైవర్లు

ఉద్యోగ భద్రత కల్పించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ ఆస్పత్రుల్లో పనిచేసే మిడ్ లెవెల్ హెల్త్ అధికారులు సమస్యల పరిష్కారం కోరుతూ రోడ్కెక్కారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో తొలుత సమావేశం నిర్వహించారు. అక్కడి జ్యోతిరావు పూలే పార్కు వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కలెక్టరేట్ గేటు వద్ద ధర్నా చేపట్టారు. చిన్నారులు, కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఎం.ఉషారాణి, పి.ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.


చంటిబిడ్డతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న సిబ్బంది

ఉగ్ర చర్యలను ఖండించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉగ్రవాదం దేశ ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీస్తుందని, అభివృద్ధికి ఆటంకమని డాక్టర్ కె.సుధీర్ అన్నారు. శ్రీకాకుళంలో నగరంలో ప్రజావేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఏడు రోడ్ల కూడలి నుంచి కోడిరామ్మూర్తి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు, లాయర్లు, కవులు, రచయితలు, పెన్షనర్లు, జేసీస్, మానవతా, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘం, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ఉగ్రవాదానికి మతం రంగు పులమకూడదన్నారు. విద్యావేత్తలు డాక్టర్ జామి భీమశంకరం, ప్రొఫెసర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ ఉగ్రవాదం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో కేతవరపు శ్రీనివాస్, బి.కృష్ణమూర్తి, ఎం.ప్రభాకరరావు, ఎస్.కిషోర్‌కుమార్, కె.నాగమణి, ఉషారాణి, ఆర్.మల్లేశ్వరరావు, జోగినాయుడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజావేదిక సంఘు నాయకులు

గాయపడిన వ్యక్తి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్:కింతలి మిల్లు సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌పై వెళుతున్న బత్తిలి సత్యం (48) మార్చి 2న ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీ కొట్టడంతో గాయపడిన సంగతి తెలిసిందే. శ్రీకాకుళం రిమ్స్‌లో చేరి చికిత్స పొందుతుండగా.. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం తోటపాలెం పంచాయతీ పెయిలవానిపేట. పోలీసులు కేసు నమోదు చేశారు.

స్తంభించిన ఆర్టీఏ సేవలు


ఆర్టీఏ కార్యాలయంలో సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని తండేవలసలో ఉప రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం సేవలు స్తంభించాయి. గురువారం రాత్రి కురిసిన ఈదురుగాలులు, వర్షాలకు ఎక్కడికక్కడే విద్యుత్ వైర్లు, కేబుల్ వైర్లు తెగడంతో సేవలు నిలిచిపోయాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల ఆర్టీఏ సేవలు మొరాయించాయి. దీంతో వివిధ పనుల కోసం వచ్చిన వాహనచోదకులకు నిరీక్షణ తప్పలేదు.